దళారుల దోపిడీకి చెక్..





2





2

వాలీబాల్ పోటీలకు రెంజర్ల విద్యార్థి



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



**అక్షరటుడే, ఇందూరు :** ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు జిల్లా కలెక్టరేట్‌లో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఈ సెంటర్‌ను ఆదివారం కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంతమంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకుని ఓటు వేశారని కలెక్టర్ ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రవిబాబు, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ ఉన్నారు.



# మిగిలింది ఒక్కరోజే..



**మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ నెల 11న ఎన్నికలు నిర్వహించడానికి ఉమ్మడి జిల్లా అధికారులు అంతా సిద్ధం చేశారు. దీంతో అభ్యర్థులు ప్రచారంలో జోరు పెంచారు. క్యాంపెయినింగ్‌కు ఒక్క రోజు మాత్రమే గడువు ఉండడంతో కాలనీల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయ మరింత వేడెక్కింది. - అక్షరటుడే, కామారెడ్డి**

- రేపటితో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెర
- దూకుడు పెంచిన అభ్యర్థులు
- గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు

ఉమ్మడి జిల్లాలో నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్నాయి. 60 డివిజన్లు, 184 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించడానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికలు సమీపిస్తుండడంతో అభ్యర్థులు ప్రచారంలో వేగం పెంచారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం గడువు తక్కువగా ఉండడంతో అన్ని కాలనీల్లో ప్రచారం చేయడానికి అభ్యర్థులకు సమయం సరిపోలేదు. దీంతో నిత్యం 12 నుంచి 14 గంటలు ప్రచారంలో పాల్గొన్నారు.

### మిగిలింది ఒక్కరోజే..

మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ వేసిన అభ్యర్థులకు ఆయా పార్టీల నుంచి ఈ నెల 3న బీ ఫాంలను అందజేశారు. మరుసటి రోజు నుంచి ప్రారంభమైన ఎన్నికల ప్రచారం 5 రోజులుగా కొనసాగుతోంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచే కాకుండా గుర్తింపు పొందిన ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రంతో ప్రచారం ముగియనుండడంతో అభ్యర్థులు ఓటర్ల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

### రంగంలోకి ముఖ్య నేతలు..

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇప్పటికే అభ్యర్థులు ప్రతి ఇంటిని చుట్టుముట్టేశారు. ఈ నెల 6న సీఎం రేవంత్ రెడ్డి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో సభ నిర్వహించగా.. ఎంపీ అర్వింద్ ప్రతి రోజు ప్రచారంలో పాల్గొంటున్నారు. శనివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద మున్సిపాలిటీలలో పర్యటించారు. రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి అజారుద్దీన్ కామారెడ్డి పట్టణంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. అధికార పార్టీ నుంచి ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంత్ రావు, మదన్ మోహన్ రావు, బీజేపీ నుంచి ధనపాల్ సూర్యనారాయణ గుప్తా, పైడి రాకేష్ రెడ్డి, కాటిపల్లి వెంకట రమణారెడ్డి, బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, గంప గోవర్ధన్, జాజాల సురేందర్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ ఎన్నికల ప్రచారంలో జోరుగా పాల్గొంటున్నారు.

### గెలుపే లక్ష్యంగా ..

మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు మెజారిటీ మున్సిపల్ పీఠాలను కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ఎన్నికలకు ముందు మున్సిపాలిటీలకు ప్రత్యేక నిధులు కేటాయించి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా అభ్యర్థులకు బాసటగా నిలుస్తున్నారు. మరోవైపు బీజేపీ సైతం మున్సిపాలిటీలలో పాగా వేయడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. ఎన్నికల్లో ప్రచారాన్ని ముమ్మరం చేసింది. బీఆర్ఎస్ సైతం ప్రభుత్వ వ్యతిరేకత తమకు కలిసి వస్తోందని భావిస్తోంది. ఈ మేరకు కాంగ్రెస్ వైఫల్యాలను ఆ పార్టీ నాయకులు ప్రజలకు వివరించి ఓట్లు అడుగుతున్నారు. అభ్యర్థులు ప్రచారంలో బిజీగా ఉండగా.. వారి అనుచరులు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుస్తున్నారు. ఓటర్లకు కావాల్సినవి సమకూరుస్తూ.. తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ నగర అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ అన్నారు. నగరంలోని తన నివాసంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. డీఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి ఇప్పటికీ కనిపిస్తోందన్నారు. కొత్తగా నగరంలో బీఆర్ఎస్, బీజేపీలతో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆయన పేర్కొన్నారు. డీఎస్ ఎప్పుడైతే అనారోగ్యం కారణంగా రాజకీయాలకు దూరంగా ఉన్నారో అప్పటి నుంచి నగరంలో అభివృద్ధి మందగించిందన్నారు. రాష్ట్రంలో విజన్ ఉన్న వ్యక్తి రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్నారని సంజయ్ అన్నారు. రెండు రోజుల క్రితమే సీఎం నిజామాబాద్‌కు వచ్చి నిజామాబాద్ అభివృద్ధి బాధ్యత తనదేనని హామీ ఇచ్చారన్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించినట్లుగానే మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. మేయర్ పీఠంపై కాంగ్రెస్ అభ్యర్థిని కూర్చోబెట్టాలని సూచించారు. నేతలు చేసిన అభివృద్ధిని చెప్పుకుంటూ ముందుకు సాగాలని డీఎస్ అంటుండేవారని సంజయ్ తెలిపారు. ఏమీ చేయని అర్వింద్ చెప్పుకోవడానికి ఏమీ లేదు కాబట్టే నిజామాబాద్ పేరు మార్చాలని పట్టుబడుతున్నాడన్నారు. గతంలో ఇద్దరు ఛైర్మన్లు బీజేపీకి చెందిన వారే ఉన్నారని.. అప్పుడు పేరెందుకు మార్చలేదని ప్రశ్నించారు. తన హయాంలో నగరంలో అభివృద్ధిలో ఎంత ముందుకు వెళ్లిందో అందరికీ తెలుసన్నారు.

## రేపు సాయంత్రం నుంచి వైన్ షాప్‌లు మూసివేత

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం :** మున్సిపల్ ఎన్నికల వేళ మద్యంప్రియులకు షాక్ తగలనుంది. ఎన్నికల నియమావళిలో భాగంగా మద్యం షాప్‌లను మూసివేయనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి 11వ తేదీ సాయంత్రం ఓటింగ్ ముగిసే వరకు వైన్‌షాప్‌లు, బార్లు, కల్లు దుకాణాలు, ఆర్మీ క్యాంటిన్, హరిత హోటల్‌లను మూసి ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల నిబంధనలను పక్కాగా పాటించాలని ఆయన సూచించారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలోని అని మద్యం సంబంధిత దుకాణాలకు ఈ నిబంధన వర్తిస్తుందని ఆయన తెలిపారు.

## ఎల్లారెడ్డి మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని మున్సిపల్ ఎన్నికల ఇన్‌ఛార్జి, మంత్రి అజారుద్దీన్ అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీలోని వార్డుల్లో ఆదివారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజారుద్దీన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన ఉందన్నారు. అధికారంలోకి రాగానే తాము ఇచ్చిన హామీల ప్రకారం ఆరు గ్యారంటీలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తున్నామని వివరించారు. గత సర్పంచ్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు మున్సిపల్ ఎన్నికల్లో కూడా రిపీట్ కావాలన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గత పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబడిన ఎల్లారెడ్డి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదేనని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను అన్ని వార్డుల్లో బంపర్ మెజారిటీతో గెలిపించాలని మంత్రి ప్రజలను కోరారు. అభివృద్ధి కొనసాగాలంటే, సంక్షేమ పథకాలు మరింత విస్తృతంగా అమలవ్వాలంటే కాంగ్రెస్ పార్టీ కి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ అజారుద్దీన్ పుట్టినరోజు నాడు మా నియోజకవర్గానికి రావడం ఆనందంగా ఉందన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ప్రతి వార్డుకు సమాన న్యాయం జరిగేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## 39వ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం..

**అక్షరటుడే, ఇందూరు :** నగరంలోని 39వ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థిని జ్యోతి మురళి కృష్ణ అన్నారు. ఈ మేరకు కాలనీల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. నిజామాబాద్ అర్బన్‌లో అవినీతి లేకుండా అభివృద్ధి కావాలంటే బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఎంపీ ఎమ్మెల్యే సహకారంతో పూర్తిస్థాయిలో డివిజన్‌ను ముందుకు తీసుకెళ్తామన్నారు. ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనపై ముఖ్యంగా దృష్టిపెడతామని హామీ ఇచ్చారు. తనను ఆదరించే అవకాశం ఇస్తే 19వ డివిజన్‌ను ముందుకు తీసుకెళ్తానన్నారు.

## మావోయిస్టు నేతకు కన్నీటి నివాళి..



**అక్షరటుడే, కామారెడ్డి:** మూడున్నర దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీలో కీలకంగా పనిచేసిన లోకోటి చందర్ అలియాస్ పడకల్ స్వామి మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా భ భ్రమ్రఘడ్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే చందర్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి ఆయన కుమారుడు లోకోటి రమేష్ శనివారం గడ్చిరోలి వెళ్లారు. ఆదివారం మృతదేహం స్వగ్రామానికి చేరుకోవడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. దశాబ్దాల కాలం పాటు బానిసత్వానికి గురై పీడించబడుతున్న ప్రజల పక్షాన నిలబడిన విప్లవ వీరుడు నేలకొరగడంతో ఇస్రోజీవాడి గ్రామం కన్నీటి పర్యతమైంది. చివరిసారిగా నివాళులర్పించేందుకు వివిధ జిల్లాల నుంచి పౌరహక్కుల సంఘం నేతలు పెద్దఎత్తున గ్రామానికి చేరుకున్నారు. లోకోటి చందర్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ప్రజలకు మేలు చేస్తారని ఓటేసి గద్దెమీద కూర్చోబెడితే ఎన్‌కౌంటర్ల పేరిట హత్యలు చేస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టులను మొత్తంగా ఏరివేయడానికి మార్చి 31 డెడ్ లైన్ పేరుతో బూటకపు ఎన్ కౌంటర్లు చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్లలో చనిపోయేది ఆదివాసీలు, గిరిజన బిడ్డలేనన్నారు. ఇవి ప్రభుత్వ హత్యలని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఈ బూటకపు ఎన్ కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాగా.. గ్రామానికి చెందిన లోకోటి చందర్ అలియాస్ స్వామి 1990 సంవత్సరంలో అప్పటి పీపుల్స్ వార్ నక్సలైట్ ఉద్యమానికి ఆకర్షితుడై అందులో చేరాడు. అనంతరం డిప్యూటీ కమాండర్, కమాండర్‌గా ఎదిగారు. ప్రస్తుతం వెస్ట్ జోనల్ బ్యూరో కార్యదర్శిగా కొనసాగుతూ గడ్చిరోలి ఎన్ కౌంటర్‌లో మృతి చెందారు. లోకోటి చందర్‌తో పాటు ఆయన భార్య సులోచన కూడా దండకారణ్యంలో చేరి దాదాపు ఎనిమిది సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. వీరి కుమారుడు లోకోటి రమేష్, లోకోటి లావణ్య సైతం తల్లిదండ్రుల బాటలోనే దండకారణ్యంలో చేరారు. డిసెంబర్ 2న లోకోటి రమేష్ పోలీసులకు లొంగిపోగా లావణ్య మాత్రం ఆరు నెలల క్రితం ఛత్తీస్‌ఘడ్‌లో అరెస్టయి జైలులో ఉన్నారు.

## అభివృద్ధి చేసి చూపిస్తాం..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** ఓటర్ల నమ్మకాన్ని వమ్ము చేయమని.. నన్ను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని 24వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థిని ఇప్పకాయల సుమిత్ర కిషోర్ అన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇప్పకాయల సుమిత్ర కిషోర్ కాలనీలో ప్రచారం చేస్తూ ప్రతి ఒక్కరిని కలిశారు. బీజేపీకి ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో ప్రతిఒక్క సమస్యపై అవగాహన ఉందన్నారు. అవకాశం ఇస్తే వాటిని పరిష్కరించి ముందుకు వెళ్తానన్నారు. ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సహకారంతో డివిజన్‌కు భారీగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని సుమిత్ర కిషోర్ అన్నారు. 'మన ఇందూరు – మన మేయర్' నినాదంతో ముందుకు వెళ్తామని.. ప్రతిఒక్కరూ తమకు మద్దతు తెలిపాలని వారు కోరారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తా..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** కాంగ్రెస్ ముఖ్య నాయకుల సహకారంతో 19వ డివిజన్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థిని శమంత కాటిపల్లి అన్నారు. ఈ మేరకు డివిజన్ పరిధిలోని కాలనీలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ నిజామాబాద్ జిల్లా వాసి కావడం మన అదృష్టమన్నారు. పీసీసీ చీఫ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సహకారంతో డివిజన్‌ను అన్నివిధాలుగా ముందుకు తీసుకెళ్తామని శమంత కాటిపల్లి తెలిపారు. ఒక్కసారి తనకు కార్పొరేటర్‌గా అవకాశం ఇవ్వాలని తద్వారా డివిజన్‌లో సమూలంగా మార్పులు తెస్తానని ఆమె హామీ ఇచ్చారు. ప్రతిఒక్కరిని కలుస్తూ ఇంటింటికి తిరుగుతూ ఆమె ఓట్లను అభ్యర్థించారు. ప్రజల కష్టసుఖాలను తెలుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందున నగరంలోని డివిజన్లలో కాంగ్రెస్ కార్పొరేటర్లు గెలిస్తే అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 10వ వార్డులో డప్పు కళాకారులతో వినూత్న ప్రచారం



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో ప్రచారం జోరుగా సాగుతోంది. 10వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి నీలం కళావతి రమేష్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. వార్డులో డప్పు కళాకారులతో ఆదివారం వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఉదయం నుంచి కళాకారులతో ప్రభుత్వ పథకాలు, వార్డు అభ్యున్నతికి తయారు చేసిన ప్రత్యేక మ్యానిఫెస్టోను పాటల ద్వారా ఓటర్లకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ విధంగా అమలు చేస్తానని ప్రజలకు అర్థమయ్యే విధంగా కళాకారులతో పాటల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అభ్యర్థి కళావతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థిగా పదో వార్డులో కౌన్సిలర్‌గా మొదటిసారి పోటీ చేస్తున్నట్టు తెలిపారు. ఉన్నత విద్యనభ్యసించిన తాను రాజకీయ కుటుంబం నుంచి వచ్చానని కళావతి తెలిపారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ప్రజలు ఓటు వేయడం ద్వారా వార్డు అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. ముఖ్యంగా పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలని ప్రజలు అడుగుతున్నారని, తనను గెలిపిస్తే అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు, ఇళ్లు కచ్చితంగా మంజూరు చేయిస్తానని తెలిపారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేయిస్తానన్నారు.

వ్యవసాయం అంటే కష్టనష్టాలు, రైతు అంటే అప్పులు.. ఇదే కర్షకుల జీవితాలు.. కాగా, ఈ భావనను మార్చే ప్రయత్నం చేస్తోంది ఇందూరు యువతి. చదువుతో పాటు సామాజిక స్పృహను మేళవించి, రైతులకు మేలు చేసే మార్గాన్ని ఎంచుకుంది గోపిడి సంజన.

- అక్షరటుడే, ఇందూరు

# రీల్స్‌తో రైతుకు మేలు



## ▪ 'ఇందూరు ఫార్మ్స్'గా రైతు బిడ్డ సోషల్ మీడియా ప్రయోగం.. ▪ నాణ్యమైన పసుపు విక్రయం

### రీల్స్ నుంచి రియల్ ఇంపాక్ట్ వరకు

వ్యవసాయం మాత్రమే కాదు. అమ్మమ్మ గుండ్లు, సంక్రాంతి నోములు, అయినార్లు, గోచి చీర, బంగారు తీగ.. ఇలా అనేక అంశాలపై సంజన వీడియోలు రూపొందించింది. సరదాగా మొదలైన ఈ ప్రయాణం... నేడు రైతులకు మేలు చేసే వేదికగా మారింది.

### దళారుల మోసమే ఆలోచనకు బీజం

నిజామాబాద్ జిల్లా పసుపు సాగుకు ప్రసిద్ధి. ఈ పంట ఉత్పత్తి విషయంలో తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే ప్రసిద్ధి గాంచింది నిజామాబాద్. ముఖ్యంగా ఆర్మూర్ ప్రాంతం చెప్పుకోదగినది. అలాంటిది పంట ఉత్పత్తుల విషయంలో మాత్రం గిట్టుబాటు ధర రాని దుస్థితి. ఆరుగాలం శ్రమించి, కంటికి రెప్పలా కాపాడుంటూ వచ్చిన పంటను చివరికి దళారుల చేతుల్లో పెట్టి మోసపోవాల్సిన దుస్థితి కర్షకులది. ఈ నేపథ్యంలోనే ఒకప్పుడు 50 వేల ఎకరాల పై చిలుకు సాగు చేసే పసుపు పంట.. 20 వేల ఎకరాలకు పరిమితం అవుతున్న పరిస్థితి ఉంటోంది.

### ఇతర పంటలకు విస్తరించాలని..

ప్రస్తుతం సోషల్ మీడియా ద్వారా పసుపు ఒక్కటే విక్రయిస్తున్న సంజన.. తన ప్రయోగం పూర్తిగా సక్సెస్ అయితే.. మక్క, పొడి కారం, ధనియాలు, ఆవాలు, నువ్వుల వంటి ఇతర పంటల విక్రయాలు చేపట్టాలని భావిస్తోంది.

### న్యాయమైన ధర పొందడం సవాలు..

నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం, చింతలూరు గ్రామానికి చెందిన సంజన తల్లిదండ్రులు వాణి, శ్రీనివాస్. తరతరాలుగా వ్యవసాయమే వీరి జీవనాధారం. పసుపు, మక్క, కూరగాయలు, సోయాబీన్, బోడ కాకరకాయ వంటి పంటలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే పంట పండించడం ఒకెత్తు అయితే.. న్యాయమైన ధర పొందడం మరో ఎత్తుగా మారింది.

ఈ క్రమంలోనే పసుపు పంటను విక్రయించే సమయంలో రైతులు ఎలా మోసపోతున్నారో సంజన ప్రత్యక్షంగా చూసింది. రైతుల దగ్గర తక్కువ ధరకు కొనుగోలు చేసిన దళారులు, వినియోగదారులకు మాత్రం అధిక ధరలకు విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఇందులో రైతూ నష్టపోతాడు, వినియోగదారుడూ నష్టపోతాడు... లాభపడేది దళారి మాత్రమే. ఈ అన్యాయాన్ని చూసిన సంజన.. దీనికి ప్రత్యామ్నాయం గురించి ఆలోచించింది.

### విశేష ఆదరణ..

నాణ్యమైన పసుపును సరసమైన ధరకు నేరుగా విక్రయిస్తానంటూ ఇన్‌స్టాలో ఈ రైతు బిడ్డ సంజన చేసిన పోస్టును ఒక్క రోజులోనే 20 లక్షల మంది వీక్షించారు. యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోను 10 లక్షల మంది వీక్షించడం విశేషం. ఇక, ఆర్డర్ల విషయానికి వస్తే.. ఒక్కరోజులోనే 50కి పైగా ఆర్డర్లు రావడం గమనార్హం. వీటిల్లో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, నెల్లూరు, ఏలూరు, అనంతపూర్, బెంగళూరు, చెన్నై నుంచి ఈ ఆర్డర్లు రావడం

### 'ఇందూరు ఫార్మ్స్' ఆవిర్భావం

నిజామాబాద్‌ను ఒకప్పుడు ఇందూరు అని పిలిచేవారు. కాలక్రమంలో ఆ పేరు మరుగున పడింది. ఆ పేరుకు మళ్లీ గుర్తింపు ఇవ్వాలనే భావనతో, తన ప్రాంతంపై ఉన్న అభిమానాన్ని చాటుకుంటూ 'ఇందూరు ఫార్మ్స్' పేరుతో ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ప్రారంభించింది. ప్రస్తుతం ఈ వేదిక ద్వారా నేరుగా పసుపు విక్రయాలు చేపడుతోంది. నాణ్యమైన పసుపు కావాలంటూ వినియోగదారులు ఆర్డర్లు ఇస్తుండడం సంజన ఆలోచనకు వచ్చిన ఆదరణకు నిదర్శనం.

### అందమైన రూపానికి యాసే అలంకారం

ఇక మరో విశేషం ఏమిటంటే.. నేటి యువత పల్లెటూరి యాసలో మాట్లాడాలంటే మొహమాటం పడుతుంటారు. మాట్లాడేవారిని చిన్నచూపు చూస్తారు. అయితే, సంజన మాత్రం తాను చేసే ప్రతి వీడియోలోనూ తెలంగాణ గ్రామీణ ప్రాంత యాసలో మాట్లాడుతుండటం సాహసమనే చెప్పాలి. కాగా, అందమైన ఆమె రూపానికి అదే అలంకారంగా మారింది. ఏ అంశంపైన అయినా సరే వీడియో చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే.. మిలియన్ వ్యూస్‌ను తెచ్చిపెడుతోంది.

### "పంచుకుంటే పెరిగేది జ్ఞానం"

సంజన ఆలోచనలు వ్యాపారంతోనే ఆగలేదు. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో సామాజిక అవగాహన తక్కువగా ఉంటోందని గుర్తించిన ఆమె, స్థానిక ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి అనుమతి తీసుకుని హైస్కూల్ విద్యార్థులకు.. తెలంగాణ చరిత్ర, భారతదేశ చరిత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించింది.

### సోషల్ మీడియాతో కొత్త దారి



సంజన సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ (2021-25) చదువుకుంది. చదువుతో పాటు తన హాబీగా ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో మన సంస్కృతి, సంప్రదాయాలపై రీల్స్ చేస్తూ వస్తోంది. కేవలం ఏడాది కాలంలోనే 33 వేల మందికి పైగా ఫాలోవర్స్‌ను సంపాదించుకుంది. కాగా, సంజనకు ఓ ఆలోచన వచ్చింది. "సోషల్ మీడియా ద్వారా నేరుగా తమ పంటను వినియోగదారులకు చేరవేస్తే ఎలా ఉంటుందని..?" ఆలోచనతో ఆగలేదు.. ఆచరణలో పెట్టింది.



## గెలిపించండి.. మీవెంటే ఉంటా..

**అక్షరటుడే, ఇందూరు:** తనను గెలిపిస్తే ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవచేస్తానని 38వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ అభ్యర్థి రాజేష్ కన్నా అన్నారు. నగరంలోని డివిజన్ పరిధిలోని కాలనీల్లో ఆదివారం కలియతిరిగారు. తానెప్పుడూ ప్రజల మనిషినేనని ఎల్లవేళలా వారికి అండగా ఉంటానని రాజేష్ కన్నా అన్నారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. తనకు డివిజన్‌పై పూర్తి పట్టు ఉందని.. స్థానికుడిగా ప్రతి సమస్యపై అవగాహన ఉందన్నారు. ఒక్కసారి తనకు అవకాశమిస్తే ఐదేళ్లు ప్రజాసేవ చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. డివిజన్‌కు రావాల్సిన నిధులను పక్కాగా తీసుకువచ్చి ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పిస్తానని ఆయన చెప్పారు.



## సేవ చేసే అవకాశమివ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..


**అక్షరటుడే, ఇందూరు:** మీ ఇంటి ఆడబిడ్డగా భావించి తనని గెలిపిస్తే అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానని 37వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ అభ్యర్థిని ప్యాట విజయలక్ష్మి అన్నారు. ఈ మేరకు కాలనీలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె కాలనీలో పర్యటిస్తూ తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విన్నవించారు. బీఆర్ఎస్ పాలనలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా నగరంలో జరిగిన అభివృద్ధిని ప్రతి ఒక్కరికి వివరిస్తూ అదే స్ఫూర్తితో డివిజన్‌ను సైతం అభివృద్ధి చేస్తానని ఆమె మాటిచ్చారు. ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. తనకు ఒక్కసారి కార్పొరేటర్‌గా అవకాశం ఇవ్వాలని కోరారు.



## ప్రజల ఆశీర్వాదంతో డివిజన్ అభివృద్ధికి కృషి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రజల సహకారంతో డివిజన్‌లోని కాలనీలన్నింటిని అభివృద్ధి చేసి చూపిస్తానని 27వ డివిజన్ కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థిని పెంటి కళ్యాణి దేవిదాస్ అన్నారు. ఈ మేరకు ఆనంద్‌నగర్ తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా పర్యటించారు. ఈ సందర్భంగా అభ్యర్థిని పెంటి కళ్యాణి దేవిదాస్ మాట్లాడుతూ ఒక్కసారి తనకు అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. డివిజన్‌లోని మౌలిక సదుపాయాల కల్పనకు అహర్నిశలు కృషి చేస్తానన్నారు. అలాగే ప్రజలతోనే ఉండి సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించకుండా ముందుకు వెళ్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్పొరేటర్‌గా గెలిపించి ప్రజలకు సేవ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు.

## భక్తిశ్రద్ధలతో గజానన్ మహారాజ్ ఆలయ వార్షికోత్సవం



**అక్షరటుడే,కోటగిరి :** పోతంగల్ మండలం కొల్లూర్ గ్రామంలో గజానన్ మహారాజ్ మందిరం 9వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం రాత్రి ప్రారంభమైన కీర్తన జాగరణ ఆదివారం ఉదయం వరకు సాగింది. అలాగే ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు అశోక్ మహారాజ్ బోర్గి ఆధ్వర్యంలో కీర్తన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు గజానన్ మహారాజ్ పల్లకీ ఊరేగింపు కార్యక్రమం జరిగింది. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లోని జగన్, సుంకిని సర్పంచ్ షాజీ పటేల్, ఉప సర్పంచులు రవి, కవిత చంద్రకాంత్, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పోతంగల్‌లో ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ సేవలు



**అక్షరటుడే, కోటగిరి :** రైతులకు ఎరువుల సరఫరాను పారదర్శకంగా సరఫరా చేసేందుకు ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ సేవలను ప్రారంభించినట్లు వ్యవసాయాధికారి నిషిత తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎరువుల సరఫరాను పారదర్శకంగా, సులభంగా అందించేందుకు ఈ యాప్ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా రైతులు తమకు అవసరమైన ఎరువులను ముందుగానే బుక్ చేసుకోవచ్చని, ఆధార్ ఆధారిత ధృవీకరణతో ఎరువుల దుర్వినియోగాన్ని అరికట్టే అవకాశం ఉందన్నారు. రైతులు తమ పేరు, భూమి వివరాలు నమోదు చేసుకుని సమీపంలోని డీలర్ వద్ద ఎరువులు పొందవచ్చని వివరించారు. ఇప్పటివరకు ఎదురైన ఎరువుల కొరత, బ్లాక్ మార్కెటింగ్ వంటి సమస్యలకు ఈ యాప్ ద్వారా పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి రైతుకు అతని సాగు విస్తీర్ణానికి అనుగుణంగా మాత్రమే ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే రైతు వేదికలో సంప్రదించాలని ఆమె సూచించారు.

## మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛ భారత్



**అక్షరటుడే, ఆర్మూర్:** మామిడిపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆవరణలో ఆదివారం స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. 41వారాలుగా ఈ స్వచ్ఛ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొంతుల రవీందర్, పాఠశాల విద్యార్థులు, యోగా టీం, కాలనీ మహిళలు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, బొగడమీది ప్రశాంత్, జంగిడి భోజన్న పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యుడిగా భావించి ఓటెయ్యండి..



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని 35వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా తనను గెలిపించాలని.. ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని బీఆర్ఎస్ కార్పొరేటర్ అభ్యర్థి తాటికొండ నరేష్ అన్నారు. ఈ మేరకు డివిజన్ లోని పలు ప్రాంతాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. తానెప్పుడూ ప్రజల మనిషినేనని ఎల్లవేళలా వారికి అండగా ఉంటానని తాటికొండ నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. తనకు డివిజన్‌పై పూర్తి పట్టు ఉందని.. స్థానికుడిగా ప్రతి సమస్యపై అవగాహన ఉందన్నారు. ఒక్కసారి తనకు అవకాశమిస్తే ఐదేళ్లు ప్రజాసేవ చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో నగరంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరిగిందని నరేష్ ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీడిపల్లి హారిక చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బియ్యం పంపిణీ



**అక్షరటుడే, కామారెడ్డి:** పాల్వంచ మండలం ఫరీద్‌పేట గ్రామంలో ఇటీవల గ్రామానికి చెందిన కమ్మరి స్వామి ఇటీవల మృతి చెందాడు. దాంతో పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఆ కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. సర్పంచ్ నర్సింహా రెడ్డి సూచన మేరకు జీడిపల్లి హారిక చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి 50 కిలోల సన్నబియ్యం అందజేశారు. ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు తమ్మడి స్వామి, బట్టెంకి రాజు, పరమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ భూమేష్, కారోబార్ రవీందర్, బట్టెంకి శేఖర్, గోదూరి లింగం, దేవోల్ల స్వామి, బుచ్చిగాని తేజ, సబ్బని రాజు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ వాలీబాల్ పోటీలకు రెంజర్ల విద్యార్థి



**అక్షరటుడే, ముప్కాల్:** కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో జరుగుతున్న సబ్ జూనియర్ వాలీబాల్ పోటీల్లో రెంజర్ల ఉన్నత పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం జక్కుల రవికుమార్, పీఈటీ పెగడ హరీష్ తెలిపారు. 9వ తరగతి విద్యార్థి షేక్ అశ్వాక్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీకి ఎంపికయ్యాడన్నారు. ఎంపికైన విద్యార్థిని రెంజర్ల సర్పంచ్ బొమ్మన లావణ్య భూమేశ్వర్, ఉపసర్పంచ్ ఆకుల రాజేందర్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందనలను తెలిపారు.

## అవకాశం ఇవ్వండి.. ఆదర్శంగా తీర్చిదిద్దుతాం..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** అవకాశమిచ్చి గెలిపిస్తే డివిజన్‌ను అభివృద్ధి చేస్తానని 34వ బీఆర్ఎస్ కార్పొరేటర్ అభ్యర్థిని నీతా అర్జున్ రాథోడ్ అన్నారు. ఈ మేరకు కాలనీలో విస్తృతంగా పర్యటించారు. ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె కాలనీలో పర్యటిస్తూ తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విన్నవించారు. బీఆర్ఎస్ పాలనలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఆధ్వర్యంలో నగరంలో జరిగిన అభివృద్ధిని ప్రతి ఒక్కరికి వివరిస్తూ అదే స్ఫూర్తితో డివిజన్‌ను సైతం అభివృద్ధి చేస్తానని ఆమె మాటిచ్చారు. ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానని ఆమె హామీ ఇచ్చారు. డివిజన్‌కు రావాల్సిన నిధులతో పాటు అదనపు నిధులను కోసం కూడా పోరాడతానన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో ముందుంటామని ఆమె హామీ ఇచ్చారు. తమను నమ్మి ఒక్కసారి కార్పొరేటర్‌గా అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.